క్లుప్తంగా

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం



కందనూలు: సమాజంలో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకమని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. బుధవారం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఐజేయూ) ఆధ్వర్యంలో హైదరాబాద్ మలక్‌పేట్ యశోద ఆస్పత్రి, శ్రీనేత్ర సనత్‌నగర్ వారి సహకారంతో జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్‌లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు మెగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజల శ్రేయస్సుకు అహర్నిశలు కష్టపడే జర్నలిస్టులు, వారి కుటుంబ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. రత్నగిరి ఫౌండేషన్ చైర్మన్ జూపల్లి అరుణ్ కుమార్ రావు, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్, విజయ్‌గౌడ్, సురేష్, సుదర్శన్‌రెడ్డి, వెంకటస్వామి, కన్నయ్య, శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

తాడూరు: మండలంలోని ఇంద్రకల్, యాత్మతాపూర్ గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం ఎంపీడీఓ అంజనేయులు పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్లను ఫోన్‌లో నమోదు చేశారు. పలు సందేహాలను నివృత్తి చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

పెద్దకొత్తపల్లి: మారేడుమాను దిన్నె ఫీల్డు అసిస్టెంట్ జట్టి నాగరాజు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని బుధవారం గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శంకర్‌నాయక్, మహేష్‌నాయక్‌లు మాట్లాడారు. చంద్రబండ తండా, మారేడ్‌మానుదిన్నె గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరిగినా తొలగించడం లేదని వాపోయారు. సమస్యను ఎన్నిసార్లు విన్నవించినా ఫీల్డు అసిస్టెంట్ పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో శ్రీహరిరావు, బాలునాయక్, శంకర్ యాదవ్, శ్రీనునాయక్, నర్సింహ్మా చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త బోధనలు ఆచరణీయం

కల్వకుర్తి రూరల్: ప్రవక్త బోధనలు ఆచరణీయమని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మహమ్మద్ షాహేద్ పేర్కొన్నారు. బుధవారం పట్టణములోని అల్విదాన్ మసీద్‌లో మహమ్మద్ ప్రవక్తపై శంకరాచార్య రచించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రవక్త జీవితం ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు శ్రీశైలం, ఎడ్మసత్యంతో పాటు ముస్లింలు పాల్గొన్నారు

వారోత్సవాలను విజయవంతం చేయండి

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్ గ్రామంలోని కమ్యూనిస్టు సైమన్ రాములు స్తూపం వద్ద ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ అచ్చంపేట డివిజన్ కార్యదర్శి పెర్ముల గోపాల్ కోరారు. బుధవారం మన్ననూర్‌లోని కమ్యూనిస్టు సైమన్ రాములు స్తూపం వద్ద ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కమ్యూనిస్టులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పంటల నమోదు చేయించాలి

వెల్దండ: రైతులు సాగుచేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి గణేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెద్దాపూర్‌లో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతుల వివరాలను నమోదు చేశారు. పత్తి, మొక్కజొన్న, వరి పంటలు తదితర వాటిని రైతులు నమోదు చేయించుకోవాలని సూచించారు.

వైద్య సిబ్బందిని నియమించాలి



కొల్లాపూర్: పట్టణం సమీపంలోని మాతా, శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్) ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు కేతూరి నారాయణ నేతృత్వంలో నాయకులు ఎంసీహెచ్ ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఎంసీహెచ్ కేంద్రంలో తాగునీటి వసతులు, విద్యుత్ సౌకర్యాలను మెరుగుపర్చాలన్నారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, సందు రమేష్, సాయికృష్ణగౌడ్, భాస్కర్‌గౌడ్, చంద్రశేఖర్‌రావు, అశోక్ తదితరులు ఉన్నారు.

ఆస్పత్రి నిర్మాణం పూర్తయ్యేనా?

- ఏళ్లుగా కొనసాగుతున్న ఏరియా ఆస్పత్రి పనులు
- రోగులకు తప్పని తిప్పలు



పాత ఆస్పత్రిలో కిక్కిరిసిన రోగులు



కొల్లాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి భవనం

కొల్లాపూర్: ఏడేళ్ల కిందట కొల్లాపూర్‌కు ఏరియా ఆస్పత్రి మంజూరు చేశారు. రామాపురం గ్రామ శివారులో ఆస్పత్రి నిర్మాణానికి స్థలాన్ని గుర్తించారు. భూసేకరణ, ల్యాండ్ లెవలింగ్ పనుల్లో అలస్యం కారణంగా నిర్మాణ పనులు ప్రారంభానికి జాప్యం జరిగింది. నాలుగేళ్ల కిందట అధికారికంగా ఆస్పత్రి భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆస్పత్రి నిర్మాణం కోసం రూ.22.5 కోట్లు కేటాయించారు. వీటిలో రూ.15 కోట్ల వ్యయంతో భవన నిర్మాణం, రూ.5 కోట్ల వ్యయంతో వైద్య సామగ్రి ఏర్పాటు చేయాల్సి ఉంది. భవన నిర్మాణ పనులను శ్రీసాయి కన్‌స్ట్రక్షన్స్ సంస్థ చేపట్టింది. గతేడాది 80 శాతం మేరకు భవన నిర్మాణం పూర్తయింది. ఏడాది కాలంగా చిన్నపాటి పనులు, పెయింటింగ్ వర్క్స్, టైల్స్ పనులు మాత్రమే సాగుతున్నాయి. ఆస్పత్రి ముందు లాన్ ఏర్పాటు, అటెండర్లకు వసతుల కల్పన పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. విద్యుత్ కనెక్షన్ల బిగింపు, రేలింగ్ ఏర్పాటు పనులు చేస్తున్నారు.

సివిల్ ఆస్పత్రిలోనే వైద్యసేవలు

ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో పట్టణంలోని సివిల్ ఆస్పత్రినే ఏరియా ఆస్పత్రిగా పేరుమార్చి వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ భవనంలోని కొన్ని గదులు శిథిలదశలో ఉన్నాయి. కేవలం 12 బెడ్లు మాత్రమే రోగులకు అందుబాటులో ఉన్నాయి. సీజనల్ వ్యాధుల సమయంలో బెడ్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ 300 నుంచి 400 వరకు ఓపీ సేవలు కొనసాగుతున్నాయి. రోజు 50 మందికి పైగా ఇన్‌పేషెంట్ సేవలు పొందుతున్నారు. చాలీచాలని వసతులతోనే వైద్యసేవలు నిర్వహిస్తున్నారు.

పనుల పురోగతిపై దృష్టి సారించాం



ఏరియా ఆస్పత్రి పనుల పురోగతిపై దృష్టి సారించాం. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు వివరిస్తున్నాం. పనులు పూర్తయిన తర్వాతనే కొత్త భవనంలో వైద్యసేవలు అందిస్తాం. పట్టణంలోని పాత ఆస్పత్రికి రోజువారీగా వచ్చే రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం.

– డాక్టర్. శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనిది



తిమ్మాజిపేటలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎస్ సత్యనారాయణ శెట్టి మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. మండలంలోని 14 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. యూపీఎస్ ఇప్పలపల్లి పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఉమాపతి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ప్రేమలత, శ్రీనివాస్, అక్తర్ అలీ, యాదయ్య, నిరంజన్, పవన్, జైపాల్ రెడ్డి, నజీర్, కార్తీక్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

అమ్రాబాద్: మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది ఉపాధ్యాయులను మండల విద్యాధికారి బాలకిషన్ సన్మానించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

18న మండల స్థాయి క్రీడా పోటీలు




కందనూలు: ఈ నెల 18న మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తునట్లు ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహణ కోసం(ఎస్‌జీఎఫ్) సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే, మైనార్టీ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలోని స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కోకో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, ఇతర క్రీడలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటయ్య, సుభాషిని, రమేష్, రాజన్‌గౌడ్, లావణ్య, శిరీష, గోమతి వీరప్ప, సత్యనారాయణ, రవి, యాదయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితా విడుదల



చారకొండ/వెల్దండ: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల తుది ఓటర్ల జాబితాను బుధవారం ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో చారకొండ ఎంపీడీఓ ఎంపీడీఓ శంకర్ నాయక్, వెల్దండ ఎంపీడీఓ సత్యపాల్ రెడ్డిలు విడుదల చేశారు. చారకొండలో మొత్తం ఓటర్లు 21,176 ఉండగా పురుషులు 10,693, మహిళలు 10,481, ఇతరులు 2 ఉన్నట్లు తెలిపారు. వెల్దండలో మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు సంబంధించి 11 ఎంపీటీసీ స్థానాలు, 61 పోలింగ్ స్టేషన్ ఉన్నట్లు పేర్కొన్నారు. ఎంపీఓ లక్ష్మణ్, సూపరింటెండెంట్ రేవత్‌రెడ్డి, కార్యదర్శులు ఫైయాజ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలు అధైర్యపడొద్దు



అమ్రాబాద్: కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని బీఆర్‌ఎస్ అచ్చంపేట ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రలోని ఎంకే ఫంక్షన్‌హాలులో బుధవారం అమ్రాబాద్, పదర మండలాల పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. మండల అధ్యక్షుడు వెంకటయ్య, రవీందర్‌రెడ్డి, చెన్నకేశవులు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో బుధవారం సీసీ రోడ్డు పనులను కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.5లక్షలు నిధులు మంజూరు అయ్యాయన్నారు. గ్రామంలో ఇప్పటికే అండర్ డ్రెయినేజీ పనులు నిర్మించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చంద్రమౌళి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బ్రహ్మం, అలీలు, చంద్రయ్య, మల్లయ్య, ప్రవీణ్, బాలకృష్ణ, వెంకటయ్య, రామకృష్ణ, తిరుపతిరెడ్డి, అచ్చలయ్య, రామస్వామి తదితరులు ఉన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

చారకొండ: రైతు సంక్షేమంకోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, యూరియా కోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని సింగిల్ విండో చైర్మన్ జెల్ల గుర్వయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సింగిల్ విండో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కంటే ఈ ఏడాది వరిసాగు పెరిగిందన్నారు. చారకొండ సొసైటీ ద్వారా రైతులకు గతంలో దాదాపుగా 210 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని, ప్రస్తుతం సెప్టెంబర్ మొదటి వారంలో 281 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. మండలంలోని రైతులకు యూరియా కొరత లేదని వివరించారు. సమావేశంలో సింగిల్ విండో సీఈఓ వెంకటయ్య, సిబ్బంది, బీమయ్య, స్వామి తదితరులు ఉన్నారు.

రేపు ఉపాధ్యాయ దినోత్సవ సంబరాలు

నాగర్‌కర్నూల్: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని హిమాలయ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ సంబరాలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ బదావత్ సంతోష్, డీఈఓ రమేష్ కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



పెంట్లవెల్లి: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో రామన్‌గౌడ్, నల్లపోతుల గోపాల్, కోట్ల సురేందర్, ఎర్రశ్రీను, నర్సింహనాయుడు, మూలెకుమార్, వెంకటస్వామీలు పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయాలు కొనసాగిస్తాం



ఉప్పునుంతలలో ఐలమ్మకు నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా బుధవారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి, విగ్రహాలకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం, రజక సంఘం ఆధ్వర్యంలో ఆపూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీర వనితి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె జీవితం అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ జిల్లా చైర్మన్ రాజేందర్, కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎడ్మ సత్యం, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దన్ పర్వతాలు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అచ్చంపేటలో ..



తెలకపల్లిలో ..



కొల్లాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



కల్వకుర్తిలో..

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మన్ననూర్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

బల్మూర్: మండలంలోని కొండనాగుల ఎస్సీ బాలుర వసతిగృహంలో బుధవారం బల్మూర్ పీహెచ్‌సీ డాక్టర్ కల్పన ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ కల్పన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విద్యార్థులు వ్యక్తిత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా వ్యాధులు సోకే అవకాశాలు ఉంటాయని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, వసతిగృహ అధికారి రాములు, సిబ్బంది విజయ్ కుమార్, హతిరామ్, భారతి, లలిత, పర్వతాలు, రాజు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మన్ననూర్‌లో..

మన్ననూర్: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో ఆర్‌బీకే అచ్చంపేట టీమ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రిన్సిపాల్ రూపాదేవి సమక్షంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు హిమోగ్లోబిన్‌తో పాటూ సాధారణ పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు పీహెచ్‌సీలో పరీక్షించి మందులు ఇచ్చారు. అనంతరం వండిన ఆహార పదార్థాలను వైద్యులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మహేశ్వర్, మంగ, ఫార్మసిస్టు రాజా, ఏఎన్‌ఎం రేణమ్మ, దివ్య పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతిగృహంలో..

అమ్రాబాద్: మండలంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో మన్ననూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జలుబు, జ్వరంతో ఉన్నవారికి మందులు అందజేసి వైద్య సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూ సాజిద్‌పాషా, వైద్య సిబ్బంది ఉన్నారు.

మానవ అక్రమ రవాణా అరికడదాం

కందనూలు: మానవ అక్రమ రవాణా అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా మండలి సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి అమ్మాయిలను, మహిళలను లక్ష్యంగా చేసుకొని కొందరు అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. పిల్లలకు ఫోన్లు ఇవ్వొద్దని సూచించారు. బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డీసీఈబీ రాజశేఖర్ రావు, హెచ్‌ఎం లత, ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ మిథాలి రాజ్, శ్రీలత, రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెద్దకొత్తపల్లి: వెన్నచర్ల ఉన్నత పాఠశాలలో 1988–89 సంవత్సరంలో పదో తరగతి చదివిన జయమ్మ భర్త చంద్రశేఖర్‌గౌడు గుండె సమస్యతో బాధపడుతున్నాడు. ఆపరేషన్ కోసం పూర్వ విద్యార్థులు డబ్బులను పోగు చేసుకొని రూ. 26,500 నగదును బుధవారం జయమ్మకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డా.కురుమూర్తి, కొత్త రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధులు మంజూరు

నాగర్‌కర్నూల్: నియోజకవర్గంలోని పలు తండాలలో బీటీ రోడ్ల కోసం ప్రభుత్వం రూ.10.51 కోట్లు నిధులను మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని రోజుల కిందట నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రి దృష్టికి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లడుతూ త్వరిగతిన టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులను ప్రారంభించాలని అధికారులను కోరారు.

క్షేత్రస్థాయిలో డీఎఫ్‌ఓ పర్యటన



కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎర్రగట్టు బొల్లారం గ్రామాన్ని బుధవారం డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి సందర్శించారు. గ్రామంలో ఉన్న సమస్యలు అడిగి తెలుసున్నారు. ఇళ్లు నిర్మించుకునేందుకు పట్టాలు ఇచ్చే అంశంపై గ్రామస్తులతో చర్చించారు. 1984లో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కృష్ణానది బ్యాక్ వాటర్‌లో గ్రామం మునిగిందని వివరించారు. అధికారులు ఎర్రగట్టు బొల్లారం దగ్గర ఇళ్ల నిర్మాణాలకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటేశ్వర్లు, నిరంజన్, వెంకటనర్సు చంటి, మహేష్, నరేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు హనుమంత్ నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అచ్చంపేట రూరల్: అచ్చంపేట ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, మోటార్ వైండింగ్ సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఎండీ ఫయాజ్, సహాయ కార్యదర్శిగా కృష్ణయ్య, కోశాధికారిగా ఆనంద్‌లు ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారుడిగా సురేష్‌రెడ్డి, కరీం, వెంకటయ్య, ఆచార్యవీరాచారి, రమేష్, విష్ణు, రమేష్‌ను ఎన్నుకున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు: కేసు నమోదు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని జేపీనగర్ సమీపంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లుగా ఎస్‌ఐ రాజశేఖర్ బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని జేపీ నగర్‌లోని యాదాద్రి హోమ్స్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లుగా వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. ఇంట్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.1,44,458 నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లు, పేక ముక్కలను సీజ్ చేసినట్లుగా ఎస్‌ఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

యువకుడు అదృశ్యం

కోడేరు: మండలంలోని కొండ్రావుపల్లికి చెందిన యువకుడు పవన్‌కుమార్ మంగళవారం మధ్యాహ్నం బైక్‌పై ఇంటినుంచి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో తండ్రి గోపాల్ బుధవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు సెల్: 9701009122, 9701315948 నంబర్లను సంప్రదించాలని బాధిత కుటుంబసభ్యులు కోరారు.

విద్యా ప్రమాణాలపై అవగాహన



తెలకపల్లి: విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులకు బుధవారం మండల కాంప్లెక్సు సమావేశంలో ఎమ్మార్సీ భవనంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎఫ్‌ఏ 1పై చర్చించారు. ఏఐ విరామంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటలిజెన్స్ అర్టిఫిషియేల్ అవగాహన కలిగి ఉండాలని వినూత్న అంశాలను పంచుకోవాలన్నారు. హెచ్‌ఎం శోభన్‌బాబు, మురళీధర్‌రెడ్డి, మల్లేష్, సునీల్, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ప్రశంస



కల్వకుర్తి రూరల్: రాజస్థాన్ రాష్ట్రం ఉదయపూర్‌లో నిర్వహించిన కళా ప్రదర్శనలో కల్వకుర్తికు చెందిన ఉపాధ్యాయుడు రఘురామారావు, ఉప్పునుంతల చెందిన వెంకటేష్ అద్భుతమైన ప్రదర్శన చేశారు. నీప్ 2020లో భాగంగా విద్యలో తోలుబొమ్మలాట పాత్రపై 15 రోజులపాటు వర్క్ షాప్ నిర్వహించామని వారు బుధవారం విలేకరులకు తెలిపారు. తెలంగాణ, కేరళ, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్, చత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి 90 మంది బెస్ట్ ప్రాక్టీస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారని ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి పదిమంది ఉత్తమ ఉపాధ్యాయులు హాజరయ్యారని వివరించారు. ప్రాథమిక తరగతి బోధనలో ప్రదర్శించిన కళా ప్రదర్శనకు ఆ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకునట్లు పేర్కొన్నారు.

ముస్లింల ర్యాలీ



కల్వకుర్తి రూరల్: ఈద్ ఉల్ నబీ పురస్కరించుకొని బుధవారం పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆల్ విధాన్ మసీద్ నుంచి పట్టణ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. మసీద్ వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 200 మంది రక్తదానం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సీఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డి, పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష, జరిమానా

కల్వకుర్తి టౌన్: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలుశిక్షతో పాటు, జరిమానాను జడ్జి విధించనట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని పలు కూడళ్లలో బుధవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన హన్మంతు పట్టుబడగా జూనియర్ జడ్జి కావ్య ఎదుట ప్రవేశపెట్టారు. నిందితుడికి మూడు రోజుల జైలుశిక్షతో పాటుగా, రూ.100 జరిమానాను విధించారు.

చారకొండ: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి కోర్టు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ శంషోద్దీన్ తెలిపారు. మండల కేంద్రంలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై డ్రంకెన్‌డ్రైవ్‌లో నల్గొండ జిల్లా దేవరకొండ మండలం కొండ బీమనపల్లికి చెందిన జయకృష్ణ పట్టుబడ్డాడు. బుధవారం కల్వకుర్తి జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చగా జూనియర్ సివిల్ జడ్జి కావ్య రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

20న కమిటీ ఎన్నిక

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్‌ఐడీ పాఠశాలలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఆర్.పాపల్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికకు ముందు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.